ప్రజాశక్తి
ఆదివారం 17 డిసెంబర్ 2023
5
అనంతపురం

రాప్తాడు నియోజకవర్గం ఆకుతోటపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని సచివాలయ అధికారులు బలవంతంగా తలుపులు తెరిచి కొద్ది సేపటికి ఇలా మూసి వేశారు..!!

అంగన్‌వాడీల పోరు తీవ్రం అయ్యింది. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మొక్కవోని పోరాట స్ఫూర్తితో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నిర్బంధాలను విధించినా, బెదిరింపులకు దిగినా వెరవకుండా సమ్మెను కొనసాగిస్తున్నారు. శనివారం నాటికి సమ్మె 5వ రోజుకు చేరుకుంది. అన్ని మండలాల్లోనూ అంగన్‌వాడీలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. వీరికి పలు పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు తెలుపుతున్నాయి.

పోరు ముంగిట తగ్గని

అంగన్‌వాడీలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె
- పెరుగుతున్న చిన్నారుల తల్లిదండ్రుల మద్దతు
- అంగన్‌వాడీలు వస్తేనే సెంటర్‌కు వెళ్తామంటున్న గర్భిణులు, బాలింతలు
- సచివాలయ సిబ్బంది సెంటర్లు తెరిచినా పిల్లల్ని పంపని వైనం
- తాళాలు పగులగొట్టడాన్ని అడ్డుకుంటున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం, గుత్తి, చిలమత్తూరు

అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగులగొట్టే కార్యక్రమాన్ని అధికారులు శనివారం నాడు కూడా కొనసాగించారు. ఈ చర్యలను అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. కొన్ని చోట్ల బలవంతంగా కేంద్రాలను స్వాధీనం చేసుకన్నారు. అయితే ఆ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఎవరూ పిల్లలను కేంద్రాలకు పంపడానికి ఇష్టపడడం లేదు. అంగన్‌వాడీ సిబ్బంది లేనిదే తమ పిల్లలను పంపమంటూ తల్లిదండ్రులు తెగేసి చెబుతున్నారు. గర్భిణులు, బాలింతలు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన హామీని ఇచ్చేంత వరకు సమ్మెను విరమించేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మెకు రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. ముఖ్యమంత్రి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని తల్లిదండ్రులు స్వచ్ఛందగా సమ్మెకు మద్దతను ఇస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచేందుకు వెళ్లిన సచివాలయ సిబ్బందిని వారించి అక్కడి నుంచి వెనక్కు పంపివేస్తున్నారు. బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచిన చోట కూడా నామమాత్రంగానే కేంద్రం నిర్వహణ జరుగుతోంది. పిల్లలు ఎవరూ రాకపోవడంతో కేంద్రానికి తాళాలు వేసి సచివాలయ సిబ్బంది వెనుదిరిగి వెళ్లిపోతున్నారు.

పెద్దవడుగూరు మండలంలో నోటికి నల్లగుడ్డలు కట్టుకుని నిరసన తెలుపుతన్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల ఆగ్రహం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వాటి కోసం పోరాడుతున్న వారిపై బెదిరింపులకు దిగుతుండడంపై అంగన్‌వాడీలు మండిపడుతున్నారు. ప్రతిపక్షంలో ఉండగా జగన్మోహన్‌రెడ్డి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తానంటూ హామీలు గుప్పించి గద్దెనెక్కాక వాటిని అమలు చేయకుండా మోసగించారంటూ అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓట్లు వేయించుకున్న అనంతరం ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం అణచివేత ధోరణిని మానుకుని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, లేకుంటే సమ్మె మరింత ఉధృతం అవుతుందని అంగన్‌వాడీలు హెచ్చరిస్తున్నారు.

పెరుగుతున్న తల్లిదండ్రుల మద్దతు

అంగన్‌వాడీలకు ఆయా ప్రాంతాల్లో తల్లిదండ్రుల మద్దతు పెరుగుతోంది. సమ్మె న్యాయమైనదే అంటూ సంఘీభావం తెలుపుతున్నారు. అధికారులు బలవంతంగా సచివాలయాల తలుపులను తెరుస్తున్నా పిల్లల్ని పంపడానికి తల్లిదండ్రులు సుముఖత చూపడం లేదు. అంగన్‌వాడీ టీచర్లు లేని కేంద్రాలకు తమ పిల్లల్ని పంపేది లేదంటూ స్పష్టం చేస్తున్నారు. పిల్లల్ని కేంద్రానికి పంపితే అక్కడ వారిని జాగ్రత్తగా చూసుకునే వారు లేకపోతే ఎలా పంపాలని అధికారులను ప్రశ్నిస్తున్నారు. సచివాలయ సిబ్బంది ఉంటారని చెబుతున్నా వారిపై తమకు నమ్మకం లేదని తల్లిదండ్రులు కుండబద్దలు కొట్ట చెబుతున్నారు.

సమ్మె సందర్భంగా గుత్తి పట్టణంలో వంటా వార్పు చేసి రోడ్డుపై సంహపంక్తి భోజనాలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

తలుపులు తెరవడానికే పరిమితం..!

తెరిచిన కొద్దిసేపటికే మూసి వేసిన చిలమత్తూరు అంగన్‌వాడీ కేంద్రం

అధికారులు సచివాలయాల తలుపులు తెరవడానికే పరిమితం అవుతున్నారు. కనీసం కేంద్రాన్ని ఉదయం శుభ్రం చేయడం లేదు. దుమ్మధూళిలోనే చిన్న పిల్లల్ని కూర్చే బెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తాగునీటిని కూడా ఉంచడం లేదు. బలవంతంగా పిల్లల్ని సచివాలయ సిబ్బంది తీసుకెళ్తున్నా కేంద్రంలో ఈ పరిస్థితిని చూసిన తల్లిదండ్రులు పిల్లల్ని వెనక్కు తీసుకెళ్లి పోతున్నారు. గర్భిణులు, బాలింతలు కూడా పౌష్టికాహారం తీసుకునేందుకు వెళ్లడంలేదు. అంగన్‌వాడీ సిబ్బంది వచ్చిన తరువాతనే వాటిని తీసుకుంటామని చెబుతున్నారు.

తాళం తీస్తారు.. వెళ్లిపోతారు..

సచివాలయం వాళ్లు అంగన్‌వాడీ సెంటరు తాళాలు తీస్తారు... కొద్దిసేపటికే అక్కడి నుంచి వెళ్లిపోతారు. కేంద్రం తాళాలు తెరిచినట్లు సచివాలయ సిబ్బంది ఫొటోలు తీసుకోవడం కొద్దిసేపటికే అక్కడి నుంచి వెళ్లిపోవడం జరుగుతోంది. మూడు రోజులుగా తమ కాలనీలోని కేంద్రంలో ఇదే పరిస్థితి ఉంది. తన మనవడుకు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాన్ని పిలుచుకెళ్లి అన్నం పెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

చిన్నఅక్కమ్మ, వృద్ధురాలు.గుత్తి.

భద్రతలేదని పిల్లల్ని పంపలేదు..

నా కొడుకు పి.మహ్మద్‌మాజ్‌కు 4 సంవత్సరాలు. చిలమత్తూరు అంగన్‌వాడీ కేంద్రానికి పంపుతున్నాం. ప్రస్తుతం అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో ఉన్నారు. అంగన్‌వాడీ టీచర్లు కేంద్రంలో ఉన్నప్పుడు పిల్లల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకునే వారు. ఇప్పుడు ఎవరెవరూ అంగన్‌వాడీ కేంద్రంలో ఉంటున్నారు. వారిని నమ్మి పిల్లల్ని ఎలా పంపాలి. పిల్లల అక్కడ రక్షణ ఉండడం లేదు. అందుకే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వచ్చేంత వరకు నా కుమారున్ని కేంద్రానికి పంపను.

నవీన్‌తాజ్, చిలమత్తూరు

ఇప్పుడున్న వారిపై నమ్మకం లేదు..

నా కూతురు అంగన్‌వాడీ ప్రీస్కూల్‌కు వెళ్తుండేది. ఇప్పుడు సచివాలయ సిబ్బంది వచ్చి అంగన్‌వాడీ కేంద్రం తెరిచాం పిల్లల్ని పంపాలని చెబుతున్నారు. అక్కడికెళ్తే ఎవరూ ఉండడం లేదు. దీంతో నాకూతుర్ని ప్రీస్కూల్‌కి పంపలేదు. తాత్కాలికంగా వచ్చే వారిపై నమ్మకం లేకనే ఈ నిర్ణయం తీసుకున్నాను. అంగన్వాడీలు చేస్తున్న సమ్మె న్యాయమైనదే. ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలి. లేకుంటే పిల్లలు అంగన్‌వాడీలకు దూరం అయ్యే ప్రమాదం ఉంది.

అశ్విని, చిలమత్తూరు

పాలు,గుడ్లు ఇవ్వడం లేదు

అంగన్వాడీ కేంద్రంలో పాలు, గుడ్లు ఇవ్వడం లేదు. అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నప్పుడు పిలిచి మరీ ఇచ్చేవారు. ఇప్పుడు సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రం తాళాలు అయితే తీస్తున్నారు తప్పా పాలు, గుడ్లు గురించి పట్టించుకోవడం లేదు. ఏదైనా అడిగితే తమకేమి సంబంధం లదేని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల ద్వారా పౌష్టికాహారం అందజేయాలి.

సువర్ణ, గర్భవతి.దాసరి కాలనీ, గుత్తి.

అంగన్వాడీలు బాగా చూసుకునేవారు..

అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మమ్మల్ని బాగా చూసుకునేవారు. పాలు, గుడ్లు, రాగి పిండి పాకెట్లుతో కూడిన పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా ఇచ్చేవారు. కేంద్రంకు వెళ్లలేని పరిస్థితి ఉంటే ఇంటి వద్దకొచ్చి ఇచ్చేవారు. నాలుగు రోజులుగా అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం ఇవ్వడం లేదు. దీని గురించి అక్కడున్న సచివాలయ సిబ్బందిని అడిగితే పట్టించుకోవడం లేదు. ఐదు రోజులుగా సచివాలయ సిబ్బంది ఎవరికీ పౌష్టికాహారం ఇవ్వడం లేదు.

సరళ, బాలింత,గుత్తి.

21 నుంచి నిరవధిక సమ్మె

కమిషనర్, మేయర్లకు నోటీస్ అందజేత

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక కార్పొరేషన్‌లో మేయర్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మికి సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులకు జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు ప్రధానంగా సమాన పనికి-సమాన వేతనం, పర్మినెంట్ చేయాలని, సిపిఎస్ రద్దు, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్-సెమీ స్కిల్డ్, హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కోవిడ్, మలేరియా, గార్బేజ్ కార్మికులకు కనీస వేతనం రూ.15వేలు ఇవ్వడంతోపాటు ఇపిఎఫ్, ఇఎస్ఐ కల్పించాలని, 60ఏళ్ల దాటిన వారి పేర్లు తొలగించిన ఇంజనీరింగ్ కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే రాష్ట్ర కేంద్రంలో ప్రిన్సిపల్ సెక్రటరీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌కు సమ్మె నోటీసు ఇచ్చానమన్నారు. అయినా స్పందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నేతలు తిరుమలస్వామి, మల్లికార్జున, సంజీవరాయుడు మదమంచి లోకనాథచౌదరి, ఎమ్మార్పీఎస్ సంఘం నాయకులు నల్లప్ప, సిఐటియు నగర అధ్యక్షులు ఎన్టీఆర్ శ్రీనివాసులు, గురురాజా, ప్రకాష్, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బండారి స్వామి, సాకే తిరుమలేశు, ఇంజనీరింగ్ విభాగం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి కోశాధికారి, పోతులయ్య, సూర్య నారాయణ, మున్సిపల్ యూనియన్ నగర జిల్లా మహిళా నాయకులు మంత్రి వరలక్ష్మి, లక్ష్మీ నరసమ్మ, సర్దానమ్మ, కాంతమ్మ, లక్ష్మీదేవి, జయరాం, ఆదినారాయణ, ముత్యాలమ్మ, మరియమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో కమిషనర్‌కు నోటీస్ అందజేస్తున్న నాయకులు, కార్మికులు

గుత్తి : తమ దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించనిపక్షంలో సమ్మెకు వెళ్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు తెలిపారు. ఈమేరకు స్థానిక మున్సిపల్ మేనేజర్ మురళీధరకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమకు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకూ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రామాంజనేయులు, కె.సూర్యనారాయణ, నాయకులు కె.మహేష్, బాలరంగయ్య, ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు ఎస్.రాజా, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాళ్లు పట్టుకున్నా కనికరించరా..

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతన్నలు
తహశీల్దార్ కార్యాలయం ముట్టడించిన అన్నదాతలు
సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన, బిజెపి నాయకుల మద్దతు

ప్రజాశక్తి-ఉరవకొండ

హంద్రీనీవా నీటిని జిబిసికి మళ్లించి ఆదుకోవాలని అధికారుల కాళ్లు పట్టుకున్నా కనికరించరా..? అంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం అనంతపురం-బళ్లారి 42వ జాతీయ రహదారిపై బైఠాయించి విడపనకల్ మండలానికి చెందిన రైతులు రాస్తారోకో నిర్వహించారు. వీరికి సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన బిజెపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు చేతికి వచ్చే సమయంలో నీరందకపోతే ఎలా అని వాపోయారు. ఈ సమయంలో కుటుంబాలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వచ్చి సమస్య పరిష్కరించే వరకూ ఆందోళన కొనసాగిస్తామని భీష్మించుకుని కూర్చున్నారు. జిబిసి కాలువ నీటిని నమ్ముకుని వేల ఎకరాల్లో మిరప, పత్తి, జొన్న, తదితర పంటలు వేశామన్నారు. ఇప్పుడు ఉన్నట్టుండి అర్ధాంతరంగా అధికారులు నీళ్ల నిలిపివేస్తే పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు రెండు గంటల నుంచి తహశీల్దార్ కార్యాలయం, జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్నా అధికారులు స్పందించకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాస్తారోకో విరమించాలని కోరిన సిఐ, ఎస్ఐ కాళ్లపై పడి రైతులు వేడుకున్నారు. తర్వాత ఆలస్యంగా వచ్చిన తహశీల్దార్ ఈరమ్మ కారును అడ్డుకుని నిరసన తెలిపారు. ఇందుకు తహశీల్దార్ ఈరమ్మ స్పందిస్తూ సమస్యను జిల్లా అధికారులకు వివరించి వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు, బిజెపి నాయకులు నారాయణస్వామి, టిడిపి నాయకులు బీడీ చిన్నమారయ్య, హనుమంతు, తిమ్మరాజు, రాజేష్, నాగరాజు, జనసేన నాయకులు గోపాల్, చంద్రశేఖర్, వందలాదిమంది రైతులు, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఎస్పీ అన్బురాజన్‌కు అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్‌కు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో డిస్క్ కమెండేషన్ అవార్డు దక్కింది. శనివారం నాడు విజయవాడలోని మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రాష్ట్ర డిజిపి కె.వి రాజేంద్రనాథ్‌రెడ్డిలో అవార్డును అందుకున్నారు. కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్, 'దిశ', శాంతిభద్రతల విభాగంలో అత్యుత్తమ పనితీరు కనబరచిన ఐపిఎస్ అధికారులకు ప్రతి ఏటా కమెండేషన్ అవార్డులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో భాగంగా మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎస్పీ డీజీపీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

ఎస్పీ అన్బురాజన్‌కు అవార్డు అందజేస్తున్న డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు 'దుర్గం' విద్యార్థులు

కళ్యాణదుర్గం : రాష్ట్రస్థాయిలో జరిగే హ్యాండ్‌బాల్ పోటీలకు పట్టణానికి చెందిన నార్త్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు గాయిత్రిబాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి చదువుతున్న కృష్ణచరణ్, సాయిచరణ్ ఈనెల 23న గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పీడీ చల్లా కిరణ్, పాఠశాల సిబ్బంది ప్రవీణ్, షకీలా, పద్మావతి, శివన్న తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం

బుక్కరాయసముద్రం : ఎన్నోఏళ్లుగా ఎదురుచూస్తున్న మండలంలోని పసులూరు, పి.కొత్తపల్లి గ్రామాలను బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శనివారం జిల్లాకేంద్రంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిని జడ్పిటిసి భాస్కర్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా ఏళ్ల నుంచి కొత్తపల్లి, పసులూరు గ్రామాలు ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నాయన్నారు. దీంతో ఆయా గ్రామల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. వారి ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరి సాంబశివారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ, కొండారెడ్డి, గుజ్జల కాశప్ప, నేసే శ్రీనివాసులు, జి.భాస్కర్‌రెడ్డి, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే అపవాదులు

కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు అభివృద్ధిని చూసి ఓర్వలేక రాజకీయ వికృత చేష్టల్లో భాగంగా అపవాదులు మోపే ప్రయత్నాలు చేయటం సిగ్గుచేటని బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళి అన్నారు. శనివారం స్థానిక సుభాష్ రోడ్డులోని అర్బన్ బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తమ పాలకవర్గం ఏర్పడక ముందు జరిగిన లావాదేవీలను వక్రమార్గంలో చూపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. యూట్యూబ్‌లను వేదికలు చేసుకుని అభివృద్ధి వైపుగా నడుస్తున్న బ్యాంకును పాలకవర్గాన్ని ఖాతాదారులను మభ్యపట్టే రీతిలో పలువురు రాజకీయ నాయకులు వికృత చేష్టలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. చిన్నపాటి అవినీతి మరకలు అంటకుండా తమ పాలకవర్గం పని చేస్తోందన్నారు. పాలకవర్గం ఏర్పడిన సంవత్సర కాలంలో బ్యాంకు అభివృద్ధి వైపుగా నడిపిస్తుంటే చూసి ఓర్వలేక ఇలాంటి వికృత చర్యలకు దిగుతున్నారన్నారు. ప్రధానంగా అర్బన్ బ్యాంకు ఖాతాదారులకు ఛైర్మన్‌గా బాధ్యతాయుతంగా జవాబు చెప్పాల్సిన అవసరం ఉండడంతో విలేకరుల సమావేశం పెట్టి వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంకు సీఈవో ఎం.విజయభాస్కర్, వైస్ ఛైర్మన్ రమణయ్య, డైరెక్టర్లు మాగిశెట్టి చంద్రశేఖర్, వెంకటాద్రి, భాస్కర్, జంగం శెట్టి రామాంజనేయులు, గోల్డ్ బాషా, రొళ్ల భాస్కర్, చింతా భాస్కర్, సుంకర రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళి

హామీలు అమలు చేయాలనే కోరుతున్నాం..

ఎర్రచీరలతో అంగన్వాడీల నిరసన - వంటావార్పులతో దీక్షల వద్దే భోజనాలు

ఆత్మకూరులో వంటావార్పు చేస్తున్న సిఐటియు నాయకులు నాగేంద్ర, అంగన్వాడీలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇచ్చిన మాట తప్పకుండా హామీలు అమలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని అంగన్‌వాడీలు కోరారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 5వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన సమ్మెలో అంగన్‌వాడీలు అమ్మోరు తల్లి వేషధారణలతో నోట్లో వేపాకు పెట్టుకుని శిబిరం వద్ద రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమ్మెకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాట తప్పను మడమ తిప్పను అంటూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పదేపదే చెబుతుంటారని అలాంటి వ్యక్తి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. అంగన్‌వాడీలు న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సింది పోయి బలవంతంగా సమ్మె విరమింపజేయాలని చూడటం సిగ్గు చేటుగా ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి తెరిచి బెదిరింపు ధోరణికి ప్రభుత్వం పాల్పడుతుండటం దుర్మార్గంగా ఉందన్నారు. అంగన్‌వాడీలు కోరుతున్నట్లుగా కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాల్సిందే అన్నారు. గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించేంత వరకు సిఐటియు పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, ఏపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఐఎఫ్‌టియు నాయకులు ఎస్.రత్నం, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు విజయభారతి, జమున, నాయకులు నక్షత్ర తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని అంగన్వాడీలు, సహాయకులు చేస్తున్న సమ్మె శనివారం 5వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట రోడ్డుపై వంటావార్పు చేసి అక్కడే భోజనం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కారం చేసేవరకు సమ్మె విరమించేది లేదని అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగ, రేష్మ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా నాయకులు జగ్గిలి రమేష్, పట్టణ కార్యదర్శి రాముడునాయక్, ఆవాజ్ కమిటీ నాయకులు షబ్బీర్, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు నాగమణి, మేరీ, కుమారి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 5వరోజుకు చేరుకుంది. వీరి సమ్మెకు మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ముందుగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిప్పేస్వామి, రాము, వన్నూరు స్వామి, ఆదిలక్ష్మి, వన్నూరమ్మ, తిప్పేరుద్ర, నాగరాజు, నరసింహులు, సీనా మరియు మున్సిపల్ కార్మికులు మరియు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాధమ్మ, రుద్రమ్మ, శోభ, ఉలిగమ్మ, మరియు రాయదుర్గం మండల అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

గుత్తి : తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. అందులో భాగంగా శనివారం సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నల్లరిబ్బన్లు కళ్ళకు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ముందుగా శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎమ్మెల్సీ షేక్ బాబ్జీ కు సంతాపం వ్యక్తం ఆయన చిత్రపటాన్ని ఉంచి పూలమాలేసి నివాళులర్పించారు. అంగన్వాడీలు రెండు నిమిషాలు మౌనం పాటించారు.అంగన్వాడీలు వంటవార్పు కార్యక్రమం చేపట్టారు. అక్కడే సహ భక్తి భోజనం చేశారు. అంగన్వాడీల సమ్మెకు ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి, సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, విఏఎ యూనియన్ నాయకులు మద్దతు పలికారు. శిబిరంలో బైఠాయించి నాయకులు సంఘీభావం తెలిపారు.

ఉరవకొండలో ఎమ్మెల్సీకి సాబ్జీకి నివాళులర్పిస్తున్న అంగన్వాడీలు

ఆత్మకూరు : అంగన్వాడీలు చేపట్టిన సమ్మెను అణిచివేయాలని చూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి పతనం తప్పదని సిఐటియు జిల్లా జనరల్ సెక్రటరీ నాగేంద్రకుమార్ హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శనివారం 5వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజులపాటు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు విధులు నిర్వహించకపోతే రాష్ట్రవ్యాప్తంగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం వంటావార్పు చేసి అక్కడే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి రాజేశ్వరమ్మ, మధ్యాహ్నం భోజన పథకం జి ల ్లా

శింగనమలలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

గుంతకల్లులో వంటావార్పు చేసుకుని భోజనం చేస్తున్న అంగన్వాడీలు

కార్యదర్శి జ యమ్మ, అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారానికి ఐదోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మెకు సంఘీభావం తెలిపిన సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సమ్మె చేస్తే పట్టించుకోకపోగా అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగులగొట్టి తెరవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే సిపిఎంతోపాటు ప్రజాసంఘాలను కలుపుకుని ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు కార్యదర్శి జయలలిత, శశికళ, రమాదేవి, అనంతలక్ష్మి, సిపిఎం నాయకులు పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరు మండల కేంద్రంలో కూడా సమ్మె శిబిరం కొనసాగింది. ముందుగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యుటిఎఫ్ నాయకులు సాబ్జీకి నివాళులర్పించారు. అనంతరం యల్లనూరు, నిట్టూరు, వేములపల్లి, మేడికుర్తి, మల్లేపల్లి ,సింగవరం, కూచువారిపల్లి తదితర గ్రామాల్లో అంగన్వాడీ సెంటర్ల తాళాలు బద్దలు కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని శిబిరం నుంచి ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఇన్‌ఛార్జి సీఐకు ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజారామిరెడ్డి, రమేష్, సూరీ,

పుట్లూరులో నిరసన తెలుపుతున్న సిఐటియు, అంగన్వాడీ నాయకులు

గుమ్మఘట్టలో కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిరసన

గుత్తిలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

అంగన్వాడీలు పాల్గొన్నారు.

పామిడి : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 5వరోజుకు చేరుకుంది. వీరు సమ్మె చేయబట్టి ఐదురోజులు కావస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. వీరి సమ్మెకు టిడిపి, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అనిమిరెడ్డి, మల్లేష్, జనసేన మండల అధ్యక్షుడు ధనుంజయ, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్, టిడిపి నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, బొల్లు శ్రీనివాసరెడ్డి, గౌస్‌పీరా, రాజేష్‌నాయక్, బాబా, కరూరు శివ, నల్లబోతుల శీన, కుమార్, హరి, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శకుంతల మాట్లాడుతూ ప్రభుత్వం తమ పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంభించడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ప్రాజెక్టు కార్యదర్శి మేరీ, నాయకులు రాధిక, మెహ్రూన్ రుద్రమ్మ, చంద్రకళ, మల్లక్క, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె శనివారం ఐదవ రోజుకు చేరుకుంది. మరోవైపు అధికారులు అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొటి తెరిచినా కేంద్రాలకు గర్భిణులు, పిల్లలు ఎవరూ రాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి తమ న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు.

శింగనమల : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె శనివారం ఐదవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా అంగన్వాడీలు నోటికి నల్లగుడ్డ కట్టుకుని నిరసన తెలిపారు. కాగా మండల వ్యాప్తంగా అంగన్వాడీ, మినీ అంగన్వాడీ సెంటర్లను పరిశీలించగా ఒక్క కేంద్రంలో మినహా అన్ని కేంద్రాల్లో పిల్లలకు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. కొన్నిచోట్ల బలవంతంగా పిల్లలను తీసుకెళ్లినా భయభ్రాంతులకు గురై ఏడుస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకురాళ్లు నాగమణి, రమణమ్మ, బి.రత్నమ్మ, భారతి, నాగేశ్వరమ్మ, ప్రమీళమ్మ, హరిప్రియ, ప్రసన్నకుమారి, రామాంజినమ్మ, ఓబుళమ్మ, బి.సరస్వతి, రుషింగమ్మ, లక్ష్మీదేవి, మహాలక్ష్మి, శ్రీలక్ష్మి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించేంత వరకూ పోరాటాలు కొనసాగిస్తామని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఉరవకొండ ప్రాజెక్టు కార్యదర్శి విజయ, అరుణకాంతమ్మ స్పష్టం చేశారు. ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం కూడా కొనసాగించారు. ఇందులో భాగంగా అంగన్వాడీలు ఎర్రచీరలు కట్టుకుని వచ్చి నిరసన తెలిపారు. ముందుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి నివాళులర్పించారు. సమ్మెకు సిపిఎం మండల కన్వీనర్, విరుపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చెన్నారాయుడు, హమాలీ సంఘం నాయకులు చిన్న ఆంజనేయులు, యానిమేటర్ల సంగం నాయకులు సుధాకర్, రాజు, ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండల లీడర్లు ధనలక్ష్మి, విజయ, శ్వేతనాగు, జ్యోతి, రామాంజినమ్మ, స్వర్ణలత, దుర్గాదేవి, రామాంజనమ్మ, హేమలత, దేవి, లక్ష్మీదేవి, శశికళ, నాగమణి, శివశ్రీ, సువర్ణమ్మ, కృష్ణవేణి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మె శనివారం 5వ రోజుకు చేరుకుంది. ముందుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమ్మెకు సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ కార్మికులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఐదు రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నా సిఎం జగన్ స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా తక్షణమే స్పందించి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను పరిష్కరించడానికి సీఎం జగన్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ ఆదాతోనే భవిష్యత్తు

ఎపిఎస్‌పి డిసిఎల్ ఇఇ వి.రాజశేఖర్

గుత్తి : విద్యుత్‌ను పొదుపుగా వాడితేనే వినియోగదారులకు భవిష్యత్తు ఉంటుందని ఎపిఎస్ పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రాజశేఖర్ తెలిపారు. శనివారం గుత్తిలో జాతీయ పొదుపు వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఏపీఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం నుంచి గాంధీ కూడలి వరకూ ఇంజనీర్లు అధికారులు, కార్మికులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాట్లాడుతూ ఇంధన సంరక్షణ, పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందన్నారు. మనం పొదుపు చేసే విద్యుత్ రైతులు, కర్మాగారాలకు ఉపయోగపడి ఆహారం వస్తువు రూపేనా మనకే చేరుతుందని గ్రహించాలన్నారు. బొగ్గు, గ్యాస్, క్రూడ్ ఆయిల్ ఇప్పటికే కరిగిపోతున్నాయని వాటిని బాధ్యతాయుతంగా వాడితేనే రేపటి తరాలకు ఆదర్శంగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిఎస్‌పిడిసిఎల్ డిఇ సాయి శంకర్, ఎఇ ఎం.శ్రీకుమార్, లైన్ ఇన్స్‌పెక్టర్లు కె.నాగేంద్రప్రసాద్, ప్రహల్లాద లైన్ మ్యాన్లు, జేఎల్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం : ప్రజాప్రయోజనాల కోసం న్యాయవ్యవస్థ ఏర్పాటు చేసిన శాశ్వత లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టౌన్‌బ్యాంకులో బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళి అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు శాశ్వతమైన, న్యాయబద్ధమైన పరిష్కారం దొరికేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు నాణ్యమైన చట్టం న్యాయం ఏకకాలంలో లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు సీఈవో విజయభాస్కర్, అర్బన్ బ్యాంక్ లీగల్ అడ్వైజర్ సత్యనారాయణరెడ్డి, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

సేల్‌టాక్స్ అధికారుల తనిఖీలు

పామిడి : పట్టణంలో సేల్‌టాక్స్ ఇన్స్‌పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో శనివారం పలు కిరాణా దుకాణాలు, ఆయిల్ ట్రేడర్స్, ఆటోమొబైల్స్, ఫర్టిలైజర్స్, ఐరన్ మార్ట్స్‌ల్లో తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఐరన్ దుకాణానికి రూ.2వేలు, కిరాణా దుకాణానికి రూ.500 అపరాధ రుసుం విధించామన్నారు. కాగా అధికారులు తనిఖీలు చేస్తున్న సమయంలో కొన్ని షాపులను మూసివేశారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

యుటిఎఫ్ పూర్వ అధ్యక్షులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి తీరని లోటని యుటిఎఫ్ అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య అన్నారు. ఈమేరకు శనివారం జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో ఉద్యమ నేత సాబ్జి మృతి చెందడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ సాబ్జీ అప్రెంటిస్ వ్యవస్థ రద్దు, అప్రెంటిస్ సర్వీస్‌కు నోషనల్ ఇంక్రిమెంట్ల సాధన కోసం 14ఏళ్లలో అనేక ఆందోళనలు, దీక్షలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన మృతి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దేవేంద్రమ్మ, సహాధ్యక్షురాలు సరళ, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, నాగేంద్ర, వివిధ మండలాల నాయకులు శ్రీనివాసులు, నాగేంద్ర, గంగాధర్, శేషప్ప పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో...

ఉపాధ్యాయ ఉద్యమంలో గొప్ప యోధుడిగా పీడీఎఫ్ ఎమ్మెల్సీ సాకే సాబ్జీ నిలిచారని జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు అన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ సాబ్జి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై జెవివి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల పోరాటాలకు మద్ధతుగా హాజరై తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై సాబ్జి మృతి చెందడం బాధిస్తోందన్నారు. ఇలాంటి గొప్ప వ్యక్తి మృతి చెందడం పోరాటాలకు తీరని లోటు అన్నారు. ఈ సందర్భంగా సాబ్జి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి పరామర్శ


ఎమ్మెల్సీ శివరామిరెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

ఉరవకొండ : ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో శనివారం పరామర్శించారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి భార్య ఉమాదేవి ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో విషయం తెలుసుకున్న కోట్ల సుజాతమ్మ కొనకొండ్లకు చేరుకుని ఎమ్మెల్సీని పరామర్శించారు. ఈ సందర్భంగా ధైర్యంగా ఉండాలంటూ కుటుంబ సభ్యులందరికీ భరోసా ఇచ్చారు.

వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులుగా కోదండరాం

ఉరవకొండ : వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులుగా నేసే కోదండరాం నియమితులయ్యారు. ఈమేరకు శనివారం వైసిపి కేంద్ర కార్యాలయం ప్రకటన వెలువడింది. దీంతో సిఎం జగన్‌కు కోదండరాం కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్.శివశంకర్‌రెడ్డి

శింగనమల : వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్.శివశంకర్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన సిఎం జగన్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అనంతలో 'మగువ' ఫ్యాషన్ మాల్ ప్రారంభం

ప్రారంభించనున్న సినీ నటి అనసూయ భరద్వాజ్
మేనేజింగ్ డైరెక్టర్ గోకుల్ రవి, చైతన్య

ప్రజాశక్తి-అనంతపురం

మగువ షాపింగ్‌మాల్, యజమానులు గోకుల్ రవి, చైతన్య

నగరంలోని సుభాష్ రోడ్డులో రాజేంద్ర ఏజెన్సీస్ ఎదురుగా నూతనంగా నిర్మించిన మగువ ఫ్యాషన్ మాల్‌ను సినీనటి అనసూయ భరద్వాజ్ ఆదివారం ప్రారంభించనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ గోకుల్ రవి, చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ 40 దశాబ్ధాలుగా వస్త్రరంగంలో విశేషమైన సేవలు అందిస్తూ ప్రజల ఆదరణ పొందుతున్నట్లు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో ప్రస్తుతం 14 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, ఆరు అతస్తుల్లో మగువ ఫ్యామిలీ షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకూ మహిళలకు పురుషులకు అన్నిరకాల దుస్తులు లభిస్తాయన్నారు. ప్రధానంగా మ్యారేజ్ బ్రైడల్ శారీలు, గాగ్రాలు లెహంగాలు రెడీమేడ్ డ్రస్సులు, కిడ్స్ వేర్ మెన్స్ వేర్, పట్టు చీరలు, ఫ్యాన్సీ చీరలు వివిధ రకాల అన్ని రకాల మోడల్ దుస్తులు సాధారణ ధరలకు, నాణ్యత అందించేందుకు 'మగువ' ముందుకు వచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలు ఆశీర్వదిస్తే మరిన్ని బ్రాంచ్‌లను తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు. ప్రారంభోత్సవానికి ఉమ్మడి అనంతరం జిల్లా నుంచి పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవం నేపథ్యంలో కేవలం రూ.49కే చీరలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరసన హోరు..!

ప్రజాశక్తి-అనంతపురం

అంగన్‌వాడీల సమ్మె, ఆశాల 36 గంటల నిరసనలతో ఉమ్మడి అనంతపురం జిల్లా ఈ వారం అట్టుడికింది. ఎన్నికల హామీల అమలు, సమస్య పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆందోళనబాట పట్టారు. ముఖ్యంగా అంగన్‌వాడీలు దర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సమ్మెలోకి వెళ్లారు. సిఎం జగన్ తెలంగాణ కంటే రూ.వెయ్యి అదనంగా వేతనం ఇస్తానని, ఇతర ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సంఘటిత పోరాటం ప్రారంభించారు. వీరి న్యాయమైన ఆందోళనకు పలు పార్టీలు, ప్రజాసంఘాల, ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. ఈ నెల 12వ తేదీన ప్రారంభం అయిన సమ్మె పోరాట స్ఫూర్తితో కొనసాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేసి, అన్ని మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు దీక్షా శిబిరాలను ఏర్పాటు చేసుకుని ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించేంత వరకు ఆందోళన ఆపేది లేదంటూ స్పష్టం చేస్తున్నారు. ఇక ఆశా కార్యకర్తలు కూడా ఆందోళన బాట పట్టారు. 36 గంటల నిరసన దీక్షల పేరుతో గురు, శుక్రవారాలు అనంతపురం కలెక్టరేట్, పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద వంటా-వార్పుతో నిరసన తెలిపారు. కనీస వేతనం ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని, రాజకీయ వేధింపులు ఆపాలనే తదితర డిమాండ్లతో వీరు నిరసన దీక్ష చేపట్టారు. చలిని సైతం లెక్క చేయకుండా ఆశా కార్యకర్తలు, సిఐటియు నాయకులు గురువారం రాత్రి దీక్షా శిబిరంలోనే నిద్రించారు. వీరికి పలు పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు తెలిపాయి.

నిరసనలు అణిచివేసే కుట్ర

అంగన్‌వాడీ, ఆశాల న్యాయమైన సమస్యలను పరిష్కరించే దిశగా ఆలోచన చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సమ్మె, నిరసనలను విచ్ఛిన్నం చేసే కుట్రలకు తెరలేపింది. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను బలవంతంగా బద్దలు కొట్టి తలుపులు తీయడం, ఆందోళనల్లో పాల్గొంటున్న అంగన్‌వాడీలను బెదిరించడం లాంటి చర్యలకు పాల్పడింది. ఆశాలను సైతం ఆందోళనల్లో పాల్గొనకుండా ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో వస్తున్న వారిని కాపుకాచి మరీ కిందకు దింపి పోలీసు స్టేషన్‌లకు తరలించారు. పోలీసులు ఎన్ని నిర్బంధాలను ప్రయోగించినా అంగన్‌వాడీలు, ఆశాలు వారి పోరాటాలను విజయవంతం చేశారు. సమస్యలను పరష్కరించమంటే ఆందోళనలపై ఇలా నిర్బంధాలు, దాడులు చేయించడం దుర్మార్గమైన చర్యని సిపిఎం, సిఐటియు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరింపులకు బెదిరేది లేదని అంగన్‌వాడీలు, ఆశల సమస్యల పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

కేంద్ర కరువు బృందం పర్యటన

ఉమ్మడి జిల్లాలో ఈ వారం కేంద్ర కరువు బృందం పర్యటించింది. ఈనెల 12న అనంతపురం జిల్లాలో, 13న సత్యసాయి జిల్లాలో బృందం పర్యటించి తొలి రోజు అనంతపురం కలెక్టరేట్లో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి కరువు పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం మూడు బృందాల్లో పలు మండలాల్లో పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 13వ తేదీ సైతం సత్యసాయి జిల్లాలోనూ పంటలను పరిశీలించారు. అయితే కేంద్ర కరువు బృందం పర్యటనపై నామమాత్రంగానే జరిగిందనే విమర్శలు రైతుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. తొలి రోజు సాయంత్రం 4 గంటలు పైనా పొలాలకు వెళ్లారు. వీరు వెళ్లే సమయానికి రైతులెవరూ పొలాల్లో లేకపోవడంతో కరువు పరిస్థితులను ఎవరూ తెలపలేకపోయారు. అక్కడున్న వ్యవసాయ అధికారులే పంటల పరిస్థితిని వివరించారు. 2వ రోజు కూడా హడావుడిగానే పర్యటనను ముగించుకుని కరువు బృందం సభ్యులు వెనుదిరిగారు. మొత్తంగా అనంతపురం జిల్లాకు రూ.329.82కోట్లు వ్యవసాయం, తాగునీరు, ఉపాధి హామీ అన్నింటికీ కలిపి నిధులు అవసరమవుతాయని ప్రతిపాదించారు. ఇక సత్యసాయి జిల్లాకు సంబంధించి మొత్తం కలిపి 63.29 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదించారు. ఇందులో కేంద్రం నుంచి ఏ మేరకు సహాయం అందుతుందన్నది చూడాల్సి ఉంది.

'సీమ'లో తొలిసారి ఇండిగో యాస్పిరేషన్ సిస్టమ్ చికిత్స

రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టిన వ్యక్తికి వైద్యం - కిమ్స్ సవీరా ఆసుపత్రి డాక్టర్ మూడే సందీప్

ప్రజాశక్తి-అనంతపురం

కాలి రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి కేవలం ఒక్కరోజులోనే అత్యాధునిక చికిత్స చేసి అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు నయం చేశారు. ఆస్పత్రికి చెందిన సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ మూడే సందీప్ తెలిపిన వివరాల మేరకు.. అనంతపురానికి చెందిన 35 ఏళ్ల వ్యక్తికి కుడి కాలు విపరీతమైన వాపు, నొప్పి రావడంతో రాత్రి 9 గంటల సమయంలో కిమ్స్ సవీరా ఆస్పత్రికి వచ్చారు. ఆయనకు కుడి కాలి రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టి, అది ఉదరభాగం వరకూ వెళ్లిందని పరీక్షల్లో తేలింది. ఒకవేళ అది ఊపిరితిత్తులు, గుండె వరకూ వెళ్తే ప్రాణాపాయం కూడా సంభవిస్తుంది. దీనికితోడు అప్పటికే ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఉండటం, దగ్గుతున్నప్పుడు కళ్లెతోపాటు రక్తం పడటం లాంటి సమస్యలు ఉండటంతో అతడికి థ్రాంబోలిసిస్ (రక్తం పల్చబరిచే ఇంజెక్షన్లు

ఇండిగో యాస్పిరేషన్ సిస్టమ్ చికిత్స వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ మూడే సందీప్

ఇవ్వడం) కుదరదు. కావున అత్యాధునికమైన పెనంబ్రా ఇండిగో యాస్పిరేషన్ సిస్టం సాయంతో మెకానిక్ థ్రాంబెక్టమీ అనే చికిత్స చేయాలని నిర్ణయించారు. రాయలసీమ ప్రాంతంలోనే మొదటిసారి అత్యాధునిక టెక్నిక్‌ను ఉపయోగించడం చికిత్స చేసి పూర్తిగా ఊరట లభించింది. రోగికి అప్పటికే ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్య కూడా ఉండటంతో డాక్టర్ యశోవర్ధన్ నేతృత్వంలో ఇంటర్‌కోస్టల్ డ్రైనేజ్ అనే ప్రక్రియ చేశామన్నారు. దీంతో అతడికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ఉన్నట్లు తెలిసి యాంటీబయాటిక్స్ వాడటంతో నయమైందన్నారు. ప్రతిరోజూ ఒక్కరోజు తర్వాత అతడి ఆక్సిజన్ శాచురేషన్ స్థాయి కూడా పెరిగింది. మొదట్లో విపరీతమైన కాలువాపు, నొప్పితో వచ్చిన ఆ వ్యక్తి.. చికిత్స అనంతరం హాయిగా నడుచుకుంటూ వెళ్లాడని వివరించారు.

స్తంభించిన వాహనాల రాకపోకలు

రైల్వేగేటు వద్ద లారీ బ్రేక్‌డౌన్

వాహనాల రాకపోకలకు అంతరాయం

బ్రేక్‌డౌన్ అయిన లారీ

రాయదుర్గం : పట్టణంలోని అనంతపురం రోడ్డు రైల్వేగేట్ వద్ద శనివారం ఉదయం ఓ లారీ బ్రేక్ డౌన్ కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. నల్లబండలను తీసుకొస్తున్న లారీ రైల్వే గేటు దాటాక స్పీడ్ బ్రేకర్‌ను ఎక్కే ముందు గుంత వద్ద బ్రేక్‌డౌన్‌తో ఆగింది. దీంతో గేటు వద్దే ఒకవైపు రవాణా వాహనం ఆగిపోవడంతో మరోవైపు నుంచి వాహనాలు రాకపోకలకు రహదారి ఇరుకుగా మారింది. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం వరకూ లారీని పక్కకు తొలగించే ప్రయత్నం చేయకపోవడంతో ప్రజలకు విసుగుచెందారు.

మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

టిడిపి ప్రభుత్వం రాగానే బీసీల రక్షణ చట్టం

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీల రక్షణ చట్టం తీసుకువచ్చి వారికి అండగా నిలుస్తామని మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. శనివారం అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర రజక సాధికారిక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి రజకులు తెలుగుదేశంతోనే ఉన్నారని తెలిపారు. 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తు గ్యారెంటీ కోసం సూపర్ సిక్స్ పథకాలు ప్రభుత్వం రాగానే అమలు చేస్తామన్నారు. రజకుల అభివద్ధికి అన్ని విధాల తెలుగుదేశం పార్టీ కషి చేస్తుందని, గతంలో ధోబి ఘాట్ లు నిర్మించి, నీటి సౌకర్యం కల్పించి, ఆదరణ పథకం కింద పనిముట్లు అందజేసినట్లు తెలిపారు.రాష్ట్ర అభివద్ధి కోసం టిడిపిని గెలిపించి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రజక సాధికార రాష్ట్ర కన్వీనర్ గుర్రపు సాల రామకష్ణ, మాజీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవర్ల మురళి, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, సైపుద్దీన్, పార్లమెంట్ రజక సాధికార కమిటీ కన్వీనర్ రమేష్ బాబు, గంగానగర్ వెంకటేష్, శోభ, కసాపురం కష్ణమూర్తి, నారాయణస్వామి, బోయగిరి కష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెజిటబుల్ డే

కూరగాయలపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

అనంతపురం : స్థానిక సరోజినీ రోడ్డులో ఉన్న లోటస్ కిడ్స్ అమెరికన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం వెజిటేబుల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ నిర్మల్ ఆనంద్ మాట్లాడుతూ విద్యార్థులకు తీసుకుంటున్న ఆహారం, పోషక విలువలు తెలియజేసేందుకు అన్ని రకాల కూరగాయల ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, జబీనా, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివనాయక్

డి.హీరేహాల్ : మండలంలోని మారుమూల ప్రాంతం సిద్ధాపురం తండాకు చెందిన శివానాయక్ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. దీంతో మండలంలోని వైసీపీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శివ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తామన్నారు. ఇందుకు సహకరించిన విప్ కాపు రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

18న వాహనాల బహిరంగ వేలం

అనంతపురం క్రైం : అనంతపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని వివిధ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలంపాట నిర్వహించనున్నట్లు సెబ్ ఇన్స్‌పెక్టర్ ఆర్.రవిచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు.

ఘనగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

అనంతపురం : నగరంలోని రామచంద్ర నగర్‌లో ఉన్న సెయింట్ అగస్టీన్ పాఠశాల (చర్చి స్కూలు)లో ప్రీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా పాఠశాల ప్రాంగణం, తరగతి గదులను క్రిస్మస్ ట్రీలు, స్టార్లతో అందంగా అలంకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ విజయకుమారి ఏసుప్రభువు సందేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, రెవరెండ్ ఫాదర్ జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

పేదల స్థలాలు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర చైర్మన్ బిసిఆర్.దాస్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

దళిత, గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారు. వారి నుంచి ఆ స్థలం కాపాడి పేదలకు అప్పగించాలని ఎమ్మార్పిఎస్ రాష్ట్ర చైర్మన్ బిసిఆర్.దాస్ డిమాండ్ చేశారు. శనివారం అనంతపురం రూరల్ మండలం, కురుకుంట గ్రామ సమీపంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలం వద్ద పట్టాదారులతో కలిసి నిరసన తెలిపారు. పేదలు నాటుకున్న బండలు తొలగించి కబ్జా దారులు ప్రహరి గోడ నిర్మిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బండలు తొలగించేందుకు దళితులు యత్నించగా తొలగించరాదంటూ ఈ భూమి మాదంటూ ఓ మహిళా వారిని అడ్డుకుంది. అంతలోనే పోలీసులు వచ్చి ఎమ్మార్పిఎస్ నాయకులతో మాట్లాడారు. ఆ భూమి యజమానులు ఫిర్యాదు చేశారు. మీరు ఇక్కడ నిరసన చేయరాదంటూ సూచించారు. ఎమ్మార్పిఎస్ నేతలు తప్పు పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పిఎస్ రాష్ట్ర చైర్మన్ బిసిఆర్.దాస్ మాట్లాడుతూ 2010లో అప్పటి ప్రభుత్వం దళితులు, వర్గీకరణలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, ఆత్మహత్య యత్నంలో ప్రాణాలతో బయట పడ్డ వారికి, ఇతర సామాజిక పోరాటాల్లో పాల్గొన్న వారికి సర్వే నెంబర్ 41-1, 41-3, 41-3, నందు 279 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. తామంతా ఆర్‌డిటి సంస్థను ఇళ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేయగా లబ్ధిదారుల వాటాగా చెల్లించాలనడంతో కొంత మేరకు డబ్బులు కూడా లబ్ధిదారుల ఖాతాలో చెల్లించామన్నారు. 2021లో మాకు ఇచ్చిన పట్టాలు రద్దు చేసినట్లుగా తహశీల్దార్ కార్యాలయం అధికారులు చెప్పారని, మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రద్దు చేశారన్నారు. హైకోర్టులో ఫిర్యాదు చేయగా పేదలకే ఆ స్థలాలు ఇవ్వాలని తీర్పు ఇచ్చిందన్నారు. ఇదే విషయాన్ని ఆర్‌డిఓకు విన్నవించామన్నారు. మండల సర్వేయర్‌లను నియమించి మాకు స్థలాలు కూడా కొలతలు వేశారన్నారు. పేదలు బండలు నాటుకున్నారని తెలిపారు. ఇప్పుడు ఉన్న ఫలంగా ఈ భూమి మాదంటూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం పరిశీలించి పేదలకు న్యాయం చేయాలన్నారు. పేదలకు ఏ స్థలంలో పట్టాలు ఇచ్చారో అదే స్థలంలోనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-రాయదర్గం రూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కొండయ్య ఆధ్వర్యంలో ఎంపిపి విద్యావతి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. సభ ప్రారంభం కాగానే గ్రామాల్లో సమస్యలను ప్రజాప్రతినిధుల భర్తలు ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. అధికారుల మాటను ఖతారు చేయకుండా తామే ప్రజాప్రతినిధులు అన్నట్లు అధికారులను ప్రశ్నించడం విశేషం. ఈ తీరును జీర్ణించుకోలేక ఎంపిటిసి అరుణ్‌కుమార్‌తో పాటు మరికొందరు మధ్యలోనే బయటకు వెళ్లిపోయారు. అనంతరం బిఎన్.హళ్లి సర్పంచి చంద్రకళ భర్త రామాంజనేయులు, నాగిరెడ్డిపల్లి సర్పంచి గంగమ్మ భర్త ముక్కన్న సమస్యలపై ప్రస్తావించారు. తమ గ్రామ సమస్యలను చెప్పుకుంటుంటే మధ్యలో నీ జోక్యం ఏంటని కోఆప్షన్ సభ్యుడు దిలావర్‌పై ముక్కన్న ఆగ్రహం వ్యక్తం చేశాడు. రాయదుర్గం మండలం కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని మండల వ్యవసాయ అధికారి మహేంద్ర గుర్తు చేశారు. రబీ సీజన్‌లో పంటల సాగుకు సంబంధించి ఈక్రాప్ నమోదు చేయించాలని కోరారు. మండల పరిధిలోని మల్లాపురం, మల్లాపురం తండా, పల్లేపల్లి, మెచ్చిరి, చదం, చదం గొల్లలదొడ్డి గ్రామాలకు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా నీరు సరఫరా చేసేందుకు పైప్‌లైన్లు వేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ వర్క్ ఇన్స్‌పెక్టర్ మౌనేష్ తెలిపాడు. రేకులకుంట గ్రామంలో తరగతి గదులు తక్కువగా ఉండడంతో రెండు తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారని సర్పంచి ఎర్రిస్వామిరెడ్డి ఎఇఒ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానోపాధ్యాయుడు పాఠశాలకు రావడంలేదని చెప్పడంతో అనారోగ్య సమస్యల కారణంగా సెలవులో ఉన్నారని ఎంఇఒ వెంకటరమేష్ వివరణ ఇచ్చారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులు జరగడంలేదని కో ఆప్షన్ సభ్యుడు దిలావర్ ప్రశ్నించాడు. ఈ సమావేశంలో సర్పంచులు విశ్వనాథ్‌రెడ్డి, ఇఒఆర్‌డి రంగనాయకులు, హార్టికల్చర్ అధికారిణి మౌనిక, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తున్న బిఎన్.హళ్లి సర్పంచి భర్త రామాంజనేయులు

క్రైస్తవుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

క్రైస్తవుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలో క్రైస్తవుల ప్రార్థన మందిరం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 15 సెంట్లు స్థలం కేటాయించడాన్ని హర్షిస్తూ నియోజకవర్గ క్రైస్ట్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. అనంతరం పంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ విశ్వేశ్వరరెడ్డిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. తర్వాత కేక్ కోసి తినిపించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పట్టణంలోని లక్ష్మీనరసింహ కాలనీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం పరిశీలించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని సూచించారు. ఒక్క డ్రైవర్స్ కాలనీ, లక్ష్మీనరసింహ కాలనీల్లో రూ.1.5 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి నరసింహులు, జడ్పిటిసి పార్వతమ్మ, విడపనకల్లు జడ్పిటిసి హనుమంతు, సర్పంచి లలిత, మాజీ ఎంపిపి చంద్రమ్మ, పంచాయతీ ఇఒ గౌస్, క్రైస్ట్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ ఆరోగ్యనాథన్, ఉపాధ్యక్షుడు ఆనంద్, క్రైస్ట్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జాషువా ఆనంద్, జాయింట్ సెక్రటరీ విక్రమన్, ట్రెజరర్ సురేష్, సభ్యులు రబ్బుని, ఇస్సాక్, శాంతిరాజ్, కురుబ, ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేష్, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి, పట్టణ రూరల్ సమన్వయకర్త ఓబన్న, జెసిఎస్ పట్టణ కన్వీనర్ ఆసీఫ్, నాయకులు జోగి హనుమంతు, అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

డ్రెయినేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

శింగనమల : మండలంలోని ఆనందరావుపేట గ్రామంలో డ్రెయినేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం గ్రామానికి వెళ్లి డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దృష్టికి తీసుకురాగా రూ.23 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న సాంబశివారెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న

బాల్య వివాహాలను అరికడదాం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కళ్యాణదుర్గం ప్రాజెక్టు మహిళా శిశు అభివృద్ధి అధికారిణి లక్ష్మీప్రసన్న, ఎంఇఒ కృష్ణానాయక్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'పది తర్వాత పెళ్లి కాదు.. పదకొండు' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లఘుచిత్రాల ద్వారా ప్రస్తుత సమాజంలో ఎదురైయ్యే సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో బాలల పట్ల వివక్ష తీవ్రరూపం దాల్చిందన్నారు. బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఈనేపథ్యంలో బాల్యవివాహాలు, బాలల వివక్షపై తల్లిదండ్రులకు అవగాహన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఖాసింబీ, రామాంజనమ్మ, ఆర్‌డిటి సిఒ రామకృష్ణ, ఉపాధ్యాయుడు తిమ్మప్ప, చిన్నారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పట్ట పగలే చోరీ

25 తులాల బంగారు, రూ.5 లక్షల నగదు అపహరణ

తాడిపత్రి రూరల్ : పట్టపగలు, కుటుంబ సభ్యులు ఇళ్లల్లో లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన శనివారం మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. సజ్జలదిన్నె గ్రామానికి చెందిన హాజీవలి, హుస్సేన్ బాషా సమీపంలోని పారిశ్రామికవాడలో నల్లబండల ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. రోజువారి పనిలో భాగంగా యధావిధిగా శనివారం ఉదయం పనికి వెళ్లారు. సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వచ్చే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉండగా గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు పగలగొట్టినట్లు గమనించారు. హాజీవలి ఇంట్లో 25 తులాల బంగారు, రూ.5 లక్షల నగదు, పక్కనే ఉన్న హుస్సేన్‌బాషా ఇంట్లో రూ.24వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. వెంటనే రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. రూరల్ పోలీసులు విషయాన్ని డీఎస్పీ గంగయ్యకు వివరించగా డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు చేపట్టారు.

వాలంటీర్‌పై 420 కేసు

పుట్లూరు : పింఛన్ పేరుతో ఓ మహిళ నుంచి సంతకాలు సేకరించి ఆమె భూమిని కాజేసే కుట్ర చేసిన వాలంటీర్‌పై 420 కేసు నమోదు చేసినట్లు పుట్లూరు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండల పరిధిలోని ఎస్.గూడూరు గ్రామానికి ఒంటరి మహిళ నాగేశ్వరమ్మకు చెందిన భూమిని వాలంటీర్ రమేష్ తన సమీప బంధువైన నరేష్‌కు రాసిచ్చేలా కుట్ర చేశారు. ఇందులో భాగంగా పింఛన్ పేరుతో నాగేశ్వరమ్మ చేత భూమి శాశ్వత అగ్రిమెంట్ పేపర్లపై సంతకాలు తీసుకున్నారు. వారం రోజులు తర్వాత ఈ విషయాన్ని తెలుసుకున్న బాధితురాలు బంధువుల సాయంతో పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో పాటు సోమవారం నాడు అనంతపురంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ వాలంటీర్ రమేష్, భూమిని రాయించుకున్న నాగేష్‌పై కేసు నమోదు చేయాలని పుట్లూరు పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు ఇద్దరిపై 420 కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుల అరెస్టు

అనంతపురం క్రైం : రైతుల పొలాల్లో స్ప్రింక్లర్లు, పైపులు చోరీ చేసే నిందితులను అరెస్టు చేశారు. ఈమేరకు కూడేరు మండలంలో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేయడంతోపాటు 46 స్ప్రింక్లర్ పైపులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్టులో ప్రతిభ కనబరిచిన కూడేరు ఎస్ఐ సత్యనారాయణ, పోలీసులను ఎస్పీ అభినందించారు.

గొలుసు దొంగ అరెస్టు

పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

కళ్యాణదుర్గం : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మహిళ మెడలోని గొలుసు దొంగతనానికి పాల్పడిన కంబదూరుకు చెందిన హరిజన జశ్వంత్‌ను అరెస్టు చేసినట్లు సిఐ హరినాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఈనెల 10న తుమ్మల ఉష మెడలో గొలుసు గుర్తుతెలియని వ్యక్తి లాకెళ్లాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా శనివారం ఉదయం నిందితుడిని అరెస్టు చేసి రెండుతులాల బంగారు చైను, తాళిబొట్టును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే మండల పరిధిలోని కొత్తూరు గ్రామ శివార్లలో పేకాట స్థావరంపై రూరల్ ఎస్ఐ సుధాకర్ తన సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి రూ.53160 నగదు, 5 ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

పేకాటజూదరులు..

పేకాట జూదరుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం రూరల్ ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో ఎం.కొత్తపల్లి అటవీ ప్రాంతంలో పోలీసులు దాడి చేసి 10మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.53,160 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం

మడకశిర : రొళ్ల మండలం పిల్లిగుండ్లు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రఘునందన్, నీలవేణి బదిలీపై వెళ్లడంతో శనివారం హెచ్ఎం సుధాకర్ అధ్యక్షతన ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంఇఒలు శ్రీధర్, మోహన్, ఉపాధ్యాయులు వారిని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ శైలజ, ఉపాధ్యాయులు మహేష్, నేత్రావతి, అలుపు నపల్లి హెచ్ఎం వెంకటేశ్వర్లు, రామప్ప, హరిప్రసాద్, ఆంజనేయులు, రంగనాథ్, మారుతి, వినోద్, శ్రీకాంత్‌రెడ్డి, గీతా, ఉషారాణి, పద్మశ్రీ, మంజుల, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయ ఆవరణలో శనివారం ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట గజ్జల శ్రీనివాసరెడ్డి కుమార్తె భవ్య కుమారుడు రిషి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 400 మంది అయ్యప్ప భక్తులు పాల్గొన్నట్లు సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయనాయుడు తెలిపారు.

విద్యార్థులకు కరాటే బెల్ట్ టెస్ట్ పరీక్షలు

కదిరి టౌన్ : పట్టణంలోని బేరుపల్లి వద్ద ఉన్నా జైన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం మాస్టర్ షాకీర్ ఆధ్వర్యంలో బ్లాక్ బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జైన్ స్కూల్ హెచ్ఎం జయగుప్తా హాజరై మాట్లాడుతూ కరాటే వల్ల విద్యార్థుల్లో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, ఆత్మధైర్యం, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, మేధాశక్తి పెంపొందుతాయన్నారు. కలర్ బెల్ట్స్‌లోఉత్తీర్ణులై 79 మంది విద్యార్థులకు జయగుప్తా బెల్ట్, ప్రశంసాపత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర, జాఫర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి 'బత్తల' ఆర్థికసాయం

కదిరి టౌన్ : పట్టణంలోని హరిజనవాడకు చెందిన కుళ్లాయప్పస్వామి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆయన కుటుంబానికి శనివారం రూ. 10వేలు అందజేశారు. ఆయనతోపాటు కొమ్ము భాస్కర్, కిరణ్, ముబారక్, సునీల్, రవి ఉన్నారు.

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు : మాజీ ఎమ్మెల్యే

గోరంట్ల రూరల్ : టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి తెలిపారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా శనివారం పార్థసారథి ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు మండల పరిధిలోని కరావులపల్లి, కరావువులపల్లితండాలో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వైసిపి సీనియర్ నాయకులు గంపల రమణారెడ్డి నివాసానికి వెళ్లారు. రమణారెడ్డితో పాటు చింతా గోపాల్‌రెడ్డిని టిడిపిలోకి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి అశ్వర్థ రెడ్డి, నాయకులు దేవా నరసింహులు, బీరే వేణుగోపాల్, భాస్కర్‌రెడ్డి, జయరామ్, రవినాయక్, శ్రీనివాసులు, గంగిరెడ్డి, నీలకంఠారెడ్డి, నరేష్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.